## అధికారులు నూతనోత్తేజంతో పని చేయాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట, జనవరి 2: జిల్లా సంక్షేమం, అభివృద్ధి కోసం అధికారులు, ఉద్యోగులు నూతనోత్తేజంతో పని చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమవుతూ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని అన్నారు. కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో అదనపు కలెక్టర్ రాంబాబు, రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్, డీఎఫ్‌ఓ సతీశ్, డీఆర్‌డీఓ అప్పారావు, సీపీఓ కిషన్, డీఎంహెచ్‌ఓ కోటాచలం, ఆర్డీఓ వేణుమాధవ్‌లతో పాటు తాసీల్దార్లు, ఎంపీడీఓలు, టీఎన్జీఓ నాయకులు, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

## 'డ్రైవర్లు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి'



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారులు

సూర్యాపేట అర్బన్, జనవరి 2: డ్రైవర్లు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా రవాణా శాఖ అధికారి జి.సురేశ్‌రెడ్డి అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో డ్రైవర్లకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. వాహనాలు నడిపే వ్యక్తులతో పాటు పక్కన కూర్చునే వారు కూడా తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని, వాహనాలను పార్కింగ్ చేసే సమయంలో నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. యూటర్న్ తీసుకునే సమయంలో ప్రమాదాల నివారణకు సిగ్నల్స్ ఇస్తుండాలని పేర్కొన్నారు.వాహన తనిఖీ అధికారులు జయప్రకాశ్, ఆదిత్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కళాశాలకు రావాలని పుష్పగుచ్ఛాలతో ఆహ్వానం



విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధ్యాపకులు

నేరేడుచర్ల, జనవరి 2: ఇంటర్ బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వినూత్నంగా ప్రయత్నించారు. గురువారం గరిడేపల్లి, పొనుగోడు, అబ్బిరెడ్డిగూడెం తదితర గ్రామాల నుంచి కళాశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థుల ఇండ్లకు వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి కళాశాలకు క్రమం తప్పకుండా రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మద్దిమడుగు సైదులు, కర్నాటి శ్రీనివాస్, ప్రసాద్, నర్సింహాచారి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## హమాలీలకు పెంచిన కూలి రేట్లు వర్తింపజేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



తుంగతుర్తి: దీక్షలో పాల్గొన్న హమాలీ యూనియన్ నాయకులు

కోదాడ రూరల్, జనవరి 2: సివిల్ సప్లై హమాలీలకు పెంచిన కూలి రేట్లను తక్షణమే అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణ సివిల్ సప్లై గోదాం వద్ద హమాలీ యూనియన్ నాయకులు నిర్వహిస్తున్న సమ్మెలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. కూలి రెట్లు రూ.26 నుంచి రూ.29కి పెంచుతామని జారీ చేసిన జీఓ అమలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీలకు బోనస్‌ను రూ.7,500 నుంచి రూ.10,000కు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోదాం అధ్యక్షుడు పి.కొండల్, లక్ష్మణ్, ఎన్.శ్రీనివాస్, గౌరీనాయుడు, ఎస్‌కే.నాగుల్‌మీరా, వేముల రాములు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి: తుంగతుర్తిలో నిర్వహించిన హమాలీ దీక్షలో ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగులోతు రాజారాం నాయక్, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొంకూరి శ్యాంసుందర్, సివిల్ సప్లై హమాలీ యూనియన్ గోదాం అధ్యక్షుడు బొంకూరి ఎల్లయ్య, నాయకులు మల్లెపాక వెంకన్న, తడకమళ్ల వీరస్వామి, లక్ష్మయ్య, అవిలయ్య, యల్లయ్య, సురేశ్, బాలకృష్ణ, బొంకూరి రమేశ్, రవి, వెంకన్న హరికృష్ణ పాల్గొన్నారు.

## బర్దన్ జీవితం భావితరాలకు ఆదర్శం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్



హుజూర్‌నగర్‌లో బర్దన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సూర్యాపేట టౌన్, జనవరి 2: దివంగత సీపీఐ జాతీయ నాయకుడు ఏబీ.బర్దన్ జీవితం భావితరాలకు ఆదర్శనీయమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్మ భిక్షం భవన్‌లో గురువారం నిర్వహించిన బర్దన్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బర్దన్ పదహారేళ్లు వరుసగా పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగారని గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు అనంతుల మల్లీశ్వరి, ఎల్లవుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు బూర వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు చామల అశోక్‌కుమార్, పెండ్ర కృష్ణ, రెడిమల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: పట్టణంలో నిర్వహించిన బర్దన్ వర్ధంతి కార్యక్రమంలో గన్నా చంద్రశేఖర్‌తో పాటు సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, నాయకులు శ్రీనివాస్, మల్లేశ్వరి, వెంకటేశ్వర్లు, జడ శ్రీనివాస్, రమేశ్, జక్కుల శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**SSC MEMO పోయినది**

SK.షాహీన్, W/o. ఇల్యాస్ బాబా, H.No.1-662, R/o.అంగడిపేట "X" రోడ్ (మం) PA పల్లి (జి) నల్లగొండ. నా యొక్క SSC Memo హాలియా నుండి అంగడిపేట బస్‌లో ప్రయాణిస్తుండగా పోయింది. దొరికిన వారు ఈ నెంబర్ కి ఫోన్ చేయగలరు. 9515906781.

NLG-

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ: 9182777626 | నల్లగొండ: 9182777635 | దేవరకొండ: 9182777635 |
| హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638 |
| మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638 |

## ప్రారంభానికి నోచని పీహెచ్‌సీ భవనం

- బిల్లులు రాకపోవడంతో తాళం వేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని వైద్యాధికారులు



నూతనంగా నిర్మించిన భవనం

మునగాల, జనవరి 2: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై నిత్యం వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారిపై మునగాల సమీపంలో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే క్షతగాత్రులను సూర్యాపేట లేదా కోదాడ ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సి వస్తోంది. కాగా, ఆసుపత్రులు దూరం ఉండడంతో పలుమార్లు క్షతగ్రాతుల పరిస్థితి విషమించి మృత్యువాత పడుతున్నారు. దీంతో గత ప్రభుత్వం క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో మునగాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలు మెరుగు పరిచేందుకు 2022 సంవత్సరంలో నూతన భవన నిర్మాణానికి రూ.1.56 కోట్ల నిధులు కేటాయించింది. కాగా, సంబంధిత కాంట్రాక్టర్ నూతన భవనాన్ని నిర్మించి 6 నెలలు అవుతున్నా నేటికీ ప్రారంభించక పోవడంతో అత్యవసర వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది.

**నిధులు విడుదల చేయకపోవడంతో..**

ప్రస్తుత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ చేసేదేమీ లేక నూతన భవనానికి తాళం వేసినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కోటాచలం రెండు పర్యాయాలు వచ్చి భవనాన్ని త్వరలో ప్రారంభిస్తామని చెప్పారే తప్ప ఫలితం లేకుండా పోయింది. కాంట్రాక్టర్ మాత్రం తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టలేక అప్పులపాలు అవుతున్నానని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నిర్మించిన భవనాన్ని ప్రారంభించకపోవడం అధికారుల నిర్లక్ష్యమేనని పలువురు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వంలో కేటాయించిన బిల్లులను ప్రస్తుత ప్రభుత్వం కావాలనే విడుదల చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా మునగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా మారుస్తానని హామీ ఇచ్చారని, కానీ ఆ దిశగా చర్యలు చేపట్టక పోగా నూతనంగా నిర్మించిన భవనాన్ని కూడా ప్రారంభించకపోవడం సరికాదని స్థానికులు పేర్కొంటున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి స్పందించి నూతన భవనాన్ని ప్రారంభించాలని, ట్రామా సెంటర్ ఏర్పాటు చేసి 24 గంటల వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

## 'ఆర్టీసీ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ యూనియన్ నాయకులు

సూర్యాపేట అర్బన్, జనవరి 2: ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 6న నిర్వహించనున్న సదస్సు ప్రచార పోస్టర్‌ను గురువారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బత్తుల సుధాకర్ మాట్లాడుతూ.. 'విద్యుత్ బస్సులు-ప్రజలు-ఆర్టీసీపై ప్రభావం' అనే అంశంపై నిర్వహించే సదస్సుకు జిల్లా నుంచి ఆర్టీసీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం పర్యావరణ పరిరక్షణ పేరుతో విద్యుత్ బస్సులను తీసుకొస్తుందని, దీంతో పలు కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూరుతుందని అన్నారు. ఈ విధానంలో లోపాలను గుర్తించి సవరణలు చేయాలని సూచించారు. ఆర్టీసీని కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని ప్రభుత్వాలు చూస్తున్నాయని, దీని మూలంగా ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పు లక్ష్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్ర సైదులు, శంకర్, రమణ, మల్లయ్య, వెంకన్న, ముస్తఫా, ఉపేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఇంటి ముందు ముగ్గు చెడగొట్టిన ఐదుగురిపై కేసు

మునగాల, జనవరి 2: ఓ ఇంటి ముందు వేసిన ముగ్గును చెడగొట్టడంతో పాటు ఇంట్లోని వారిని భయభ్రాంతులకు గురిచేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. మునగాల గ్రామానికి చెందిన చిత్తలూరి సీతారాం, ఆయన భార్య నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 31 అర్ధరాత్రి తర్వాత ఇంటి ముందు ముగ్గు వేశారు. వారు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మునగాల గ్రామానికి చెందిన మానుపాటి గోపి, తురక మధు, బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన మందుల దినేశ్, షేక్ సాధిక్, మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామానికి చెందిన పాల్వాయి విద్యాసాగర్ అనే ఐదుగురు సీతారాం ఇంటి ముందు వేసిన ముగ్గును చెడగొట్టడంతో పాటు బల్బులను పగులగొట్టి ఇంట్లోని వారిని భయభ్రాంతులకు గురిచేశారు. ఈ మేరకు సీతారాం ఫిర్యాదుతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## గాంధీనగర్‌లో ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

సూర్యాపేట రూరల్, జనవరి 2: ఇరువర్గాల నడుమ ఘర్షణ తలెత్తిన ఘటన పట్టణ పరిధిలోని 13 వార్డు గాంధీనగర్ సమీపంలోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ గ్రామానికి చెందిన బాలెంల నాగమ్మ, జక్కలి రమేశ్ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద కిరాణా షాపులు నిర్వహిస్తున్నారు. షాపుల నిర్వహణ విషయంలో వారి కుటుంబాల నడుమ ఘర్షణ తలెత్తడంతో నాగమ్మ, రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ బాలునాయక్ తెలిపారు.

## 4న కొబ్బరికాయల విక్రయానికి వేలం

మఠంపల్లి, జనవరి 2: మట్టపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో కొబ్బరికాయల విక్రయం, కొబ్బరిచిప్పల సేకరణ, దుకాణాల ఏర్పాటుకు ఈ నెల 4వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ చెన్నూరి విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్ గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు టెండర్ షెడ్యూల్ ధర రూ.1000 చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన



తిమ్మాపురంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

అర్వపల్లి, జనవరి 2: అర్హులను గుర్తించేందుకు ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేపడుతున్నట్లు ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తిమ్మాపురం, అడివెంల గ్రామాల్లో సర్వేను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు సుధీర్‌రెడ్డి, యాదమ్మ, మహాలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'బస్ డిపో ఏర్పాటు చేయాలి'

తిరుమలగిరి, జనవరి 2: మండల కేంద్రంలో బస్ డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 5వ తేదీన తిరుమలగిరి బస్టాండ్‌లో నిర్వహించనున్న దీక్షను విజయవంతం చేయాలని బస్ డిపో సాధన సమితి కన్వీనర్ కడెం లింగయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే దీక్షలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం



విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి, జనవరి 2: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు 74 మందికి దాత అనంతుల దుర్గాప్రసాద్ సహకారంతో గురువారం అల్పాహారం ఏర్పాటు చేశారు. వార్షిక పరీక్షల వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తామని దాత ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అల్పాహారం అందించడం అభినందనీయమన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడ రూరల్, జనవరి 2: దొరకుంట సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సైదా గురువారం తెలిపారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనుల్లో భాగంగా సరఫరాను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నెమలిపురి కాలనీ, బండపాలెం, ఇండస్ట్రీయల్ ప్రాంతం, తమ్మర, దొరకుంటలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## సొంత ఖర్చులతో గ్రామంలో బోరు ఏర్పాటు

పాలకవీడు, జనవరి 2: మండలంలోని శూన్యపహాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నీమానాయక్ తన సొంత ఖర్చులతో గురువారం గ్రామంలో బోరు వేయించాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, నీమానాయక్ దృష్టికి తీసుకెళ్లడంతో సొంత ఖర్చులతో బోరు వేయించాడని తెలిపారు. ఈ సందర్భంగా నీమానాయక్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు భీమానాయక్, రాము, శంకర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## 'రుణమాఫీ పూర్తి చేయాలి'

గరిడేపల్లి, జనవరి 2: రాష్ట్రంలో పలువురు రైతులు ఇంకా రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే రుణమాఫీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేలాది మంది రైతులు రుణమాఫీ కోసం బ్యాంకులు, వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలనే సోయి లేకపోవడం విచాకరమన్నారు.

## కాల్వలో గల్లంతైన ఇంజినీర్ మృతదేహం లభ్యం

మిర్యాలగూడ రూరల్, జనవరి 2 : నాగార్జునసాగర్ ఎడమకాల్వలో గల్లంతైన ఇంజినీర్ విజయ్‌గోస్వామి మృతదేహం గురువారం గరిడేపల్లి మండలం పొనుగోడు రిజర్వాయర్‌లో లభించినట్లు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని ఐలాపురం గ్రామం వద్ద సాగర్ ఎడమ కాల్వలో బుధవారం ఈతకు వెళ్లిన యాదాద్రి పవర్‌ప్లాంట్ ఇంజినీర్లు కార్తీక్ మిశ్ర, విజయ్ గోస్వామి నీటి ఉధృతికి కొట్టుకు పోయి గల్లంతయ్యారు. పోలీసులు వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు చేపట్టగా విజయ్‌గోస్వామి మృతదేహం లభ్యమైంది. మరో ఇంజినీర్ కార్తీక్ మిశ్ర ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్‌ఐ పేర్కొన్నారు.

**గుర్తు తెలియని మహిళ మృతదేహం**

మాడ్గులపల్లి : మండలంలోని పెద్దదేవులపల్లి రిజర్వాయర్ అవుట్‌పాల్ వద్ద గురువారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. రిజర్వాయర్ అవుట్‌పాల్ వద్ద 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళ మృతదేహం కొట్టుకు రాగా వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని దానిని వెలికితీశారు. మృతదేహంపై మెరూన్ కలర్ టాప్, రెడ్ కలర్ లెగ్గిన్ ఉన్నాయని, ఆమె మూడు రోజుల క్రితం నీళ్లలో పడి మృతిచెందినట్లు భావిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి హామీని నిలబెట్టుకోవాలి

- సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్



సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సూర్యాపేట టౌన్, జనవరి 2: తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సుమారు 700 మంది జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా గురువారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయడంతో పాటు రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత 20 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. పనికి తగిన వేతనాన్ని అందజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాంపంగు వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటరమణ, రాష్ట్ర కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, సయ్యద్, రాంబాబు, లక్ష్మీనారాయణ, నాగలక్ష్మి, సరస్వతి, తేజశ్రీ, హరిత, ప్రసన్న, నస్రీన్, నీల, లలిత, మహేశ్వరి, రంగారావు, మురళి, కవిత, రమేశ్, సుదర్శన్, వెంకట్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి'



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూర్యాపేట టౌన్, జనవరి 2: ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారసాని చంద్రకళ, కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పీఓడబ్ల్యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓ కోటాచలంకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ నాయకులు సూరం రేణుక, సంతోషిమాత, జయమ్మ, జాన్‌సుందర్, గులాం హుస్సేన్, రమేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ పోరాటం'



విద్యార్థులతో సభ్యత్వాలు చేయిస్తున్న నాయకులు

మఠంపల్లి, జనవరి 2: మండల కేంద్రం మఠంపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ నాయకుడు ఎం.రాజు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఎస్‌ఎఫ్‌ఐ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రదీప్, అశోక్, అంకిత, సునీత, అరవింద, శోభ, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరికలు



గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఆ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రాంకోటిరెడ్డి

చింతలపాలెం, జనవరి 2: మండల కేంద్రానికి చెందిన పలువురు గురువారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కందుల రాంకోటిరెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో మునగ పెద నర్సయ్య, మునగ ప్రవీణ్, మునగ అంజి కుటుంబాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు మోర్తాల వెంకటరెడ్డి, నాయకులు మైబల్లీ, మహత్యం, శ్రీనివాస్, నరేశ్, బ్రహ్మం, వెంకటేశ్వర్లు, మంగయ్య, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ వాసికి ఎంజీయూ డాక్టరేట్

రామగిరి, జనవరి 2: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ డిపార్టుమెంట్ ఆఫ్ కెమిస్ట్రీలో హైదరాబాద్‌లోని నర్సాపూర్‌కు చెందిన గడ్డం ప్రభాకర్ పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు. కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ దోమల రమేశ్ పర్యవేక్షణలో 'సింథసిస్ , బయోలాజికల్ యాక్టివిటీ అండ్ డాకింగ్ స్టడీ ఆఫ్ ఆక్సాడయోజోలిల్ పైరజైన్ పిరిడిన్ అండ్ అర్రైల్ డెరివేటివ్స్' అంశంపై పరిశోధన చేసి గ్రంథం సమర్పించడంతో యూనివర్సిటీ డాక్టరేట్ అందించింది. ప్రభాకర్ ప్రస్తుతం నర్సాపూర్‌లోని బీవీరాజు ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

మోతె, జనవరి 2: మండల పరిధిలోని అన్నారిగూడెం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కీసర సంతోశ్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎంజీయూ హాకీ జట్టు కెప్టెన్‌గా విజయ్



చిట్యాల, జనవరి 2 : సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనే ఎంజీయూ జట్టు కెప్టెన్‌గా చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన ఓర్సు విజయ్ ఎంపికయ్యారు. విజయ్ చౌటుప్పల్‌లోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో బీపీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. విజయ్ ఎంపిక పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## 'విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలి'



ఆత్మకూర్.ఎస్: డీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మండల విద్యాధికారి దారాసింగ్, ఉపాధ్యాయులు



అర్వపల్లి: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఆత్మకూర్.ఎస్, జనవరి 2: విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి దారాసింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ (డెమోక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్) క్యాలెండర్, డైరీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రవణ్, పలువురు డీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను వెంటనే నెరవేర్చాలని అన్నారు. పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగానందచారి, పబ్బతి వెంకటేశ్వర్లు, కొచ్చర్ల వేణు, బొల్లెద్దు వెంకన్న, వనజ పాల్గొన్నారు.

**సమాజానికి విలువలు నేర్పేది ఉపాధ్యాయులే**

తుంగతుర్తి: సమాజానికి విలువలు నేర్పేది ఉపాధ్యాయులేనని ఎంఈఓ బోయిని లింగయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో డీటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ మండలాధ్యక్షుడు నవీన్‌ప్రసాద్, వెంకటమల్లు, వెంకన్న, మధు, కోటయ్య, హకీమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ**

అర్వపల్లి: మండల పరిధి తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, సంఘం మండలాధ్యక్షుడు శినయ్య, కార్యదర్శి వెంకటేశ్వర్లు, మహిళా ఉపాధ్యక్షురాలు విజిత, కోశాధికారి శేఖర్, కృష్ణయ్య, నర్సయ్య, సబియా, సుల్తానా, రేనాబేగం, రాములు, శ్రీనివాస్, రవీందర్, దాసయ్య తదితరులు పాల్గొన్నారు.